సాక్షి నిర్మల్

సోమవారం । 12 । జూన్ । 2023



నోట్‌బుక్స్ పంపిణీకి సిద్ధం

రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు నోట్‌బుక్స్ కూడా పంపిణీ చేయనుంది. ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 8లో▸



వార్షికోత్సవానికి వేళాయె

నిర్మల్‌లోని గండి రామన్న ఆలయం వార్షికోత్సవానికి సిద్ధమైంది. సోమవారం నుంచి రెండురోజుల పాటు వేడుకలు నిర్వహించనున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
49.0/29.0

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. వేడి గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

గ్రూప్–1 పరీక్ష కేంద్రాల తనిఖీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించగా ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ పలు కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 14 కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు తెలిపారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయించినట్లు పేర్కొన్నారు. అన్ని కేంద్రాలను డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు పర్యవేక్షించారని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నిర్మల్ రూరల్: సోమవారం నుంచి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నిర్వహిస్తారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఐఈవో పరశురామ్ తెలిపారు. నిమిషం నిబంధన అమలులో ఉందని, విద్యార్థులంతా గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటికే సిబ్బంది, ఇన్విజిలేటర్లను కేటాయించమని తెలిపారు. 2,200 మంది ఫస్టియర్, 1,745 మంది సెకండియర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు.

రవీంద్రభారతిలో నిర్మల్ కవుల కవితాగానం

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించింది. ఇందులో నిర్మల్‌కు చెందిన కవియాత్ర అధ్యక్షుడు కారం శంకర్, వైద్యుడు దామెర రాములు జిల్లా తరఫున కవితాగానం చేశారు. కారం శంకర్ పఠించిన 'బంగారు తెలంగాణ' కవితకు విశేష స్పందన లభించింది. రాములు రాసిన 'జై తెలంగాణ' కవిత సభికులను ఆకట్టుకుంది. శంకర్, రాములు చదివిన కవిత్వాన్ని ఒక ప్రత్యేక సంకలనంలో అచ్చు వేయనున్నట్లు వక్తలు తెలిపారు.

జనావాసాల్లోకి చుక్కలదుప్పి



ఓ ఇంట్లో సేద తీరుతున్న చుక్కల దుప్పి

ఖానాపూర్: పట్టణ శివారులోని అటవీ ప్రాంతంలో ఆదివారం చుక్కల దుప్పిని ఊర కుక్కలు వెంటాడగా అది జనావాసాల్లోకి వచ్చింది. పట్టణంలోని గాంధీనగర్ కాలనీలోగల పలు నివాసాల్లోకి వచ్చిన దుప్పిని అటవీ సిబ్బంది ఫాజిల్, ఖాజిల్ పట్టుకున్నారు. క్షేమంగా దానిని అటవీప్రాంతంలో వదిలిపెట్టినట్లు ఎఫ్ఆర్వో వినాయక్ తెలిపారు. జనావాసాల్లోకి దుప్పి రావడంతో దాన్ని చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున గుమిగూడారు.

అడెల్లిలో భక్తుల సందడి



ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వరంగల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయంలో పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి సోదరుడు అల్లోల మురళీధర్‌రెడ్డి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేకపూజలకు హాజరయ్యారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ ఔట్‌పోస్టు, ఆలయ పరిసరాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.



బొప్పారంలో అఖండజ్యోతి వద్ద నినదిస్తున్న జేఏసీ నాయకులు (ఫైల్)

ఉద్యమ యాదిలో..

- నాటిరోజులు గుర్తు చేస్తున్న తెలంగాణ దశాబ్ది వేడుకలు
- పోరులో భాగమైన తీరును తలుచుకుంటున్న జిల్లా
- పదేళ్ల కిందటి ఫొటోలు షేర్‌చేస్తున్న ఉద్యమకారులు

నిర్మల్: 'రాజేందర్.. తెలంగాణ సాధనోద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉన్నది. మీవాళ్లంతా మిలియన్‌మార్చ్‌లో తప్పకుండా పాల్గొనాలె.. అని పైనుంచి పిలుపు వచ్చింది. కానీ.. అప్పటికే అంతటా పోలీసులు మోహరించారు. మా ఇళ్లలోనూ తనిఖీ చేసి వెళ్లారు. మేం బయట ఉండటంతో వారికి దొరకలేదు. అడుగడుగునా చెక్‌పోస్టులు పెట్టారు. ఎలాగైనా హైదరాబాద్ చేరుకోవాలి.. మిలియన్‌మార్చ్‌లో పాల్గొనాలి. 2011 మార్చి 9 రాత్రి.. నేను, అప్పాల వంశీ, గాజుల రవి తదితరులం కలిసి.. నిర్మల్ శివారు నుంచి బయలు దేరాం. సోన్ హైవే మీదుగా కాకుండా లక్ష్మణచాంద మీదుగా బయలుదేరాం. ఆ చీకటిలోనే సరస్వతీ కెనాల్‌లో నడుములోతు వరకు ఉన్న నీళ్లను దాటుకుని వెళ్లాం. అష్టకష్టాలు పడి హైదరాబాద్ దాకా చేరుకున్నాం. అక్కడ ఎటు చూసినా పోలీసులే. దోమలగూడ వద్దకు రాగానే అడ్డుకున్నారు. అందులో ఓ సీఐ తాము నిర్మల్‌నుంచి వచ్చిన విషయం చెప్పేసరికి.. అంతదూరం నుంచి వచ్చారా.. అంటూ హుస్సేన్‌సాగర్‌పైకి ఎలా చేరుకోవాలో ఆయనే మార్గం చూపారు. అలా ముందుకు వెళ్లి.. పైకి ఎక్కాం. ఆ సమయానికి పోలీసులు మినహా.. అక్కడ ఎవరూ లేరు. మన నిర్మల్ ఉద్యమకారులమే ముందు అడుగు పెట్టాం. ఓవైపు లాఠీచార్జీలు.. రబ్బరు బుల్లెట్ల వర్షంలో ప్రాణాలకు తెగించి ముందుకు సాగాం. 'జై తెలంగాణ' నినాదాలతో మిలియన్ మార్చ్‌లో భాగమయ్యాం..' అంటూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.. అప్పటి ఉద్యమకారుడు, ప్రస్తుత గ్రంథాలయసంస్థ జిల్లా చైర్మన్ ఎర్రవోతు రాజేందర్. ఇలాంటి ఎన్నో ఉద్యమ ఘటనలు ఎప్పటికీ మర్చిపోలేమన్నారు.

ఇలా.. ఒక్క రాజేందరే కాదు.. ఎంతోమంది ఉద్యమకారులు జిల్లాలో పోరుతెలంగాణను నడిపారు. 610 జీవోపై అవగాహన మొదలుకుని తెలంగాణ సాధించేదాకా ఎన్నో రకాలుగా ఉద్యమించారు. తొమ్మిదేళ్ల కిందటి పోరుక్షణాలను రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల వేళ నెమరువేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారులను కదిలిస్తే చాలు.. ఆ రోజుల్లో వాళ్లు చేసిన స్వరాష్ట్ర పోరాటాన్ని కళ్లకు కట్టిస్తున్నారు. తాము భాగమై సాధించిన స్వరాష్ట్ర సాధనోద్యమాన్ని యాది జేసుకుంటున్నారు.

'610'పై అవగాహనతో మొదలు..



మలిదశ తెలంగాణ ఉద్యమ బలోపేతానికి 610 జీవోనే కారణం. ఆ జీవో ఏంటో, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఎందుకు అవసరమో.. జిల్లావాసులకు తెలిసేలా చేసిన 2006 అక్టోబర్ 15న ఓ కార్యక్రమం నిర్వహించాం. జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ గ్రౌండ్‌లో అప్పుడు జేఏసీ చైర్మన్‌గా, టీఎన్జీవోస్ అధ్యక్షుడిగా నా ఆధ్వర్యంలో భారీ అవగాహన సభ ఏర్పాటు చేశాం. ఇందులో అప్పటి ఉద్యమ హేమాహేమీలైన ప్రొఫెసర్ కోదండరాం, నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మణ్, స్వామిగౌడ్, దేవీప్రసాద్, సుధాకర్, రసమయి బాలకిషన్, అంతడుపుల నాగరాజు తదితరులతో పాటు అప్పటి తెలంగాణ ప్రాంతంలోని పది జిల్లాల టీఎన్జీవోల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సభ కోసం దాదాపు రూ.6లక్షల వరకు ఖర్చు చేశాం. దీని ప్రభావంతో జిల్లాలో ఉద్యమం మరింత విస్తృతమైంది.

– ఎంసీ లింగన్న, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు, నిర్మల్

మిలియన్‌మార్చ్‌లో పాల్గొన్నం



స్వరాష్ట్ర సాధనోద్యమంలో ఏ పిలుపువచ్చినా నిర్మల్ ముందుండేది. ఇక్కడి నుంచి హైదరాబాద్, ఢిల్లీ వరకూ వెళ్లిన ఉద్యమకారులున్నారు. అప్పట్లో అన్ని నిర్బంధాలు దాటుకుని మిలియన్‌మార్చ్‌లో పాల్గొనడం సాహసోపేతమే. ఇప్పటికీ నాటిరోజులు గుర్తుకువస్తాయి.

– ఎర్రవోతు రాజేందర్, గ్రంథాలయసంస్థ చైర్మన్

అఖండజ్యోతి ఆరనీకుండా..



బొప్పారంలో ఏర్పాటు చేసిన అఖండజ్యోతిని పక్కనే హోటల్ నిర్వహించే మానాన్న రమేశ్ చూసుకునేవారు. ఎప్పటికప్పుడు నూనె పోస్తూ.. వత్తులేస్తూ ఆరనీకుండా చూశారు. బొప్పారం జేఏసీ చేసిన పోరాటమే జిల్లాలో ఉద్యమస్ఫూర్తిని రగిలించింది.

– రేగుంట సంజీవ్, బొప్పారం

విద్యార్థిగా ఉద్యమంలో..



ఎక్కడ ఉన్నా నిర్మల్ ప్రాంత బిడ్డలు తెలంగాణ పోరులో ముందున్నారని చెప్పవచ్చు. మేడ్చల్‌లో చదివేటప్పుడు అక్కడి జేఏసీతో కలిసి ఉద్యమాల్లో పాల్గొన్న. ప్రతిరోజూ ఏదో ఒకతీరులో పోరాటాన్ని కొనసాగించేవాళ్లం. నాటి పోరాటం వ్యక్తిగతంగానూ ఎంతో నేర్పింది.

– నవీన్, టౌన్‌ప్లానింగ్ అధికారి, ఖానాపూర్

ఉద్యమాన్ని రగిలించిన 'అఖండ జ్యోతి'



తెలంగాణలో ఎక్కడా లేనివిధంగా స్వరాష్ట్రం సాధించేదాకా నిరంతరంగా అఖండజ్యోతిని వెలిగిస్తూ నిత్యం ఉద్యమస్ఫూర్తిని రగిలించింది బొప్పారం. అప్పటి లక్ష్మణచాంద (ప్రస్తుత సోన్) మండలంలోని బొప్పారం గ్రామస్తులు అఖండ తెలంగాణ జ్యోతిని వెలిగించారు. ఎండావానా.. ఏదొచ్చినా ఆగకుండా, ఆరకుండా ఏకధాటిగా 1,604రోజుల పాటు ఉద్యమజ్యోతిని కొనసాగించారు. పక్కనే హోటల్ నడుపుకొనే రేగుంట రమేశ్ ఆ జ్యోతి ఆరకుండా ఎప్పుడూ ఓ కన్ను ఆ వైపే ఉంచేవాడు. గ్రామస్తులంతా తలా కొంత వేస్తూ నూనె, వత్తులు సమకూర్చుకున్నారు. బొప్పారం గ్రామ జేఏసీ చేపట్టిన అఖండజ్యోతితో పాటు మౌనపోరాటం, ఆందోళనలు అందరిలో ఉద్యమస్ఫూర్తిని రగిలించాయి.

పండుగపూట ఉపవాసాలున్నం



తెలంగాణ సాధించేదాకా ఎంతకైనా సిద్ధమని పోరాటం చేసినం. స్వరాష్ట్రం కోసం అప్పుడు పండుగరోజుల్లోనూ ఉపవాసాలున్నం. తెలంగాణ వస్తేనే మాకు పండుగ అన్నట్లు పోరాడినం. రాష్ట్రమొచ్చేదాకా నేను చెప్పులు కూడా వేసుకోలేదు.

– పుప్పాల పీరాజీ, ఉద్యమకారుడు, కుభీర్

నిరాహారదీక్ష మొదలుపెట్టినం



అప్పటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మొదటిసారిగా నిరాహార దీక్ష మొదలుపెట్టినం. నేను మూడురోజుల పాటు ఎంత కష్టమైనా ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్న. స్వరాష్ట్ర మొచ్చేదాకా భోసి జేఏసీ ఉద్యమాన్ని కొనసాగించింది.

– బామన రాఘవులు, ఉద్యమకారుడు, భోసి, తానూరు మండలం

నినదిస్తే కేసులు పెట్టారు



తెలంగాణ వస్తేనే యువత భవిష్యత్ బాగుపడుతుందని అప్పుడు ఉద్యమంలో పాల్గొన్నం. 2011 జనవరి 24 అప్పటి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్న ముధోల్ మండలం కిర్గుల్ (బి)లో నిర్వహించిన సభలో 'జైతెలంగాణ' అంటూ నినాదాలు చేశాను. పోలీసులు అప్పట్లో కేసులు కూడా నమోదు చేశారు.

– కూన వనిత, ఉద్యమకారిణి, ఓలా, కుంటాల

మంత్రిని కలిసిన దివ్యాంగులు



మంత్రికి పూలమొక్క ఇస్తున్న దివ్యాంగులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో దివ్యాంగుల సంఘం నాయకులు ఆదివారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అదనంగా రూ.వెయ్యి పింఛన్ పెంచినందుకు మంత్రికి పూలమొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు సట్టి సాయన్న, ఇసాక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ బోర్డు మెంబర్‌గా గంగా శేఖర్



గంగాశేఖర్‌ను సన్మానిస్తున్న రమాదేవి

కుభీర్: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు బీ గంగాశేఖర్‌ను కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ బోర్డు మెంబర్‌గా నియమించింది. ఈ మేరకు నియామక పత్రాన్ని ఎంపీ సోయం బాపూరావ్ గంగాశేఖర్‌కు పంపించారు. గంగాశేఖర్ గతంలో బీజేపీ మండలాధ్యక్షుడిగా పని చేశారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గంలో కొనసాగుతున్నారు. తన నియామకానికి కృషి చేసిన ఎంపీ సోయం బాపూరావ్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవికి గంగాశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గజ్జలమ్మ జాతర



ముత్యాలమ్మకు ఉల్లిగడ్డలు సమర్పిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మదేవి జాతరను ఆదివారం భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు లోకేశ్వరం మండలం గడ్చాందా గోదావరి నుంచి జలాలను తీసుకువచ్చి అభిషేకించారు. జాతర సందర్భంగా గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లకు భక్తులు ఉల్లిగడ్డలు, ఓమ, పుట్నాలు నైవేద్యంగా సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. పల్లకిసేవలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహారాష్ట్రలోని ముంబై, నాందెడ్, బోకర్, ధర్మాబాద్ శివుని, మలక్ జాం, ఇస్లాపూర్, అప్పారావుపేట్ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. చిన్నారులతో తులాభారం వేయించారు. తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సాహితీవేత్తలకు నెలవు నిర్మల్

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- ఘనంగా సాహితీ దినోత్సవం
- జిల్లా కవులకు సన్మానం



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: జ్ఞాన సరస్వతీ కొలువుదీరిన నిర్మల్ జిల్లా సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, రచయితలకు నెలవై ఉందని రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి నిర్వహించిన తెలంగాణ సాహిత్య దినోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో జిల్లాకు చెందిన 135 మంది తెలుగు, ఉర్దూ కవులు కవితలు ఆలపించారు. ప్రముఖ పద్యకవి బీ వెంకట్ పద్యగానం చేశారు. వెంకట్‌తోపాటు కవులు, కళాకారులను మంత్రి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ శాలువాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. డీపీఆర్వో విజయలక్ష్మి, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్ పాల్గొన్న ఈ సభలో డాక్టర్ అప్పాల చక్రధారి, డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, డాక్టర్ మురళీధర్, తోడిశెట్టి పరమేశ్వర్, కొండూరి పోతన్న, తోడిశెట్టి రవికాంత్, తిరునగరి సురేశ్ఖర్, కామారపు జగదీశ్వర్, డాక్టర్ కోవెల శ్రీనివాసాచార్య, బొందిడి పురుషోత్తమరావు, కదారి దశరథ్, కరిపే రాజ్‌కుమార్, పత్తి శివప్రసాద్, పీ భీమేశ్ తదితర సీనియర్ కవులను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సన్మానించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, శాస్త్రీయ నృత్య కళాకారిణి రజిత, వెన్నెల డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ ధన్‌రాజ్, కొరియోగ్రాఫర్ పరమేశ్ బృందాలు పాడిన పాటలు, నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి ఐకేరెడ్డి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అంతకుముందు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న కవయిత్రి మొల్లమాంబ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత స్వర్గీయ మడిపెల్లి భద్రయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'పది'లో మళ్లీ ఫస్ట్ స్థానం మనదే..!

- ఇందుకు నేటి నుంచే పకడ్బందీ ప్రణాళిక
- తొలిరోజే పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ
- మధ్యాహ్న భోజనంలో కొత్తమెనూ అమలు
- నేటి నుంచి బడులు ప్రారంభమవుతుండగా 'సాక్షి'తో ముచ్చటించిన డీఈవో రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో డీఈవో రవీందర్‌రెడ్డి ఆదివారం 'సాక్షి'తో ముచ్చటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులున్నాయని, ప్రైవేట్‌కు దీటుగా బోధన ఉంటుందని పేర్కొన్నారు. మొదటిరోజు నుంచే పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, ఈసారి కూడా మొదటిస్థానంలో నిలుస్తామని ధీమా వ్యక్తంజేశారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. మిగతా విషయాలు ఆయన మాటల్లోనే..

సాక్షి: మన ఊరు–మనబడి పనుల పరిస్థితి?

డీఈవో: ఈ పథకం కింద జిల్లాలోని 260 పాఠశాలలను ఎంపిక చేశాం. 72 బడుల్లో పనులు పూర్తయ్యాయి. 188 చోట్ల వివిధ దశల్లో ఉన్నాయి. అన్ని చోట్ల త్వరగా పనులు పూర్తి చేయిస్తాం.

సాక్షి: బడిబాటలో నమోదైన విద్యార్థుల సంఖ్య ఎంత?

డీఈవో: బడిబాటలో భాగంగా 3,661 మంది విద్యార్థులు కొత్తగా జాయిన్ అయ్యారు. ఇందులో 1,257 మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చారు. అత్యధికంగా ఖానాపూర్ మండలంలో 137 మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చారు.

సాక్షి: సరిపడా పాఠ్యపుస్తకాలు వచ్చాయా?

డీఈవో: జిల్లాకు 3,81,620 పుస్తకాలు అవసరం కాగా, ఇప్పటివరకు 3,49,500 జిల్లాకు చేరుకున్నాయి. వీటిని పాఠశాలలకు చేరవేశాం. సోమవారం విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తాం. ఈసారి ఒకటి నుంచి ఐదు తరగతుల వారికి ప్రభుత్వం వర్క్‌బుక్స్ ఉచితంగా అందిస్తోంది.

సాక్షి: పదో తరగతి విద్యార్థులపై ఎలాంటి శ్రద్ధ తీసుకుంటారు?

డీఈవో: మొదటిరోజు నుంచే పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటాం. ఈసారి కూడా మంచి ఫలితాలు సాధించి మొదటిస్థానం నిలబెట్టుకుంటాం. డిసెంబర్‌లోపు సిలబస్ పూర్తి చేసి రివిజన్ చేయిస్తాం. ఆ తర్వాత ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి మార్చిలో జరిగే వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేస్తాం.

సాక్షి: ప్రైవేట్ పాఠశాలల ఫీజులను ఎలా నియంత్రిస్తారు?

డీఈవో: ప్రైవేట్ పాఠశాలలన్నీ విద్యాహక్కు చట్టాన్ని తప్పకుండా పాటించాలి. నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేసినా, పాఠశాలలకు తోకపేర్లు రాసినా యాజమాన్యాలపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

సాక్షి: జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలెన్ని.. ఎప్పుడు భర్తీ చేస్తారు?

డీఈవో: జిల్లాలో 2,425మంది ఉపాధ్యాయులుండగా, 520 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ప్రమోషన్లు, డీఎస్సీ ద్వారా ప్రభుత్వం భర్తీ చేస్తుంది. ప్రభుత్వం ఆదేశిస్తే అప్పటివరకు విద్యావలంటీర్లను నియమిస్తాం.

సాక్షి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలు?

డీఈవో: మొదటిరోజే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు, నోట్ పుస్తకాలు అందజేస్తాం. మన ఊరు–మనబడి పథకం కింద జిల్లాలో 72 పాఠశాలల సుందరీకరణ పనులు పూర్తి చేశాం.

సాక్షి: మధ్యాహ్న భోజన మెనూలో మార్పులు చేశారా?

డీఈవో: అవును. మొదటిరోజు నుంచే కొత్త మెనూ అమలు పరుస్తాం. వారంలో ఒకరోజు కిచిడి, వెజ్ బిర్యాని తప్పకుండా అందిస్తాం. 20వ తేదీ నుంచి ప్రభుత్వ బడుల్లో ప్రతీరోజు ప్రార్థన సమయానికన్న ముందే అల్పాహారంగా ఒక్కో విద్యార్థికి 250 మిల్లీ లీటర్ల రాగిజావ అందించనున్నాం.

ప్రశాంతంగా గ్రూప్–1 పరీక్ష

- భారీసంఖ్యలో అభ్యర్థుల గైర్హాజరు



నిమిషం లేట్‌గా వచ్చిన అభ్యర్థిని అడ్డుకుంటున్న సిబ్బంది

నిర్మల్/మామడ: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలో 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 4,489 మందికి 3,042 మంది హాజరు కాగా, 1,447 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. రెండు, మూడు సెంటర్లలో ఒకరిద్దరు అభ్యర్థులు నిమిషం ఆలస్యంగా రాగా లోనికి అనుమతి నిరాకరించారు. కాగా, ఎక్కువ మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరు కావడానికి శుభకార్యాలు, అధిక ఉష్ణోగ్రతలే కారణమని తెలుస్తోంది.

హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సన్మానం



ఎల్లన్నను సన్మానిస్తున్న మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి

కుంటాల: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కలెక్టరేట్ భవనంలో సాహిత్య దినోత్సవాన్ని నిర్వహించగా మండలానికి చెందిన పలువురిని సన్మానించారు. పెంచికల్‌పాడ్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం ఎల్లన్న, ఉపాధ్యాయులు తుమ్మల దేవరావు, ముజ్జి రవి, కవులు, కళాకారులు తాటి శివ, గడ్డపు గజ్జారాం, తోట లక్ష్మణ్‌ను మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీఈవో రవీందర్‌రెడ్డి సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

క్లుప్తంగా

జిల్లా వాసికి డాక్టరేట్


డాక్టరేట్, పురస్కారంతో వెంకటేశ్వరశాస్త్రి సిద్ధాంతి

ఆదిలాబాద్: జిల్లాకేంద్రానికి చెందిన ప్రముఖ సిద్ధాంతి చికిలి లక్ష్మీ వెంకటేశ్వరశాస్త్రి సిద్ధాంతికి అరుదైన గౌరవం లభించింది. అమెరికాకు చెందిన పరిశోధన సంస్థ ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజికల్ ఫెడరేషన్ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ముంబైలోని ఖాందావలి వెస్ట్ ప్రాంతంలోని కంట్రీ క్లబ్ వేదికగా ఆదివారం జరిగిన అగ్ని మంతన్-2023లో ఆయన్ను డాక్టరేట్‌తో సన్మానించింది. గత 32 ఏళ్లుగా జ్యోతిష్యంలో చేసిన విశేష కృషికి పంచాంగ గణనకు జ్యోతిష్య చక్రవర్తి పురస్కారం అందజేసింది. అదే విధంగా సంస్థలో లైఫ్ టైం మెంబర్‌షిప్ ఇవ్వడం, ఆయనకు డాక్టరేట్, పురస్కారం లభించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పిచ్చికుక్క దాడిలో గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ఆదివారం పిచ్చికుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలయ్యాయి. మధ్యాహ్నం సమయంలో ఆడుకుంటుండగా ఆనం(4), సోఫియా(3), సుమయ్య(2)లపై పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. స్థానికులు, కుటుంబీకుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పిందని ఉప సర్పంచ్ అశోక్ పేర్కొన్నారు. గాయాలైన చిన్నారులను ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

తునికాకు పట్టివేత


స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కడెం: మండలంలోని పాండ్వపూర్ సమీపంలో తునికాకు తరలిస్తున్న ఎనిమిది మందిని అటవీ సిబ్బంది ఆదివారం పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్వో అనిత తెలిపారు. వారి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. జన్నారం, దస్తురాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. టైగర్ జోన్ కోర్ ఏరియా నుంచి తునికాకు సేకరణ నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మీవాడకు బాలుడు అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ పురుషోత్తంచారి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాలనీకి చెందిన మంగల్వార్ పుష్పలత-సంతోష్ దంపతుల కుమారుడు సాయికృష్ణ ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో నుంచి రూ.100 తీసుకొని ఆడుకునేందుకు బయటకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కాలనీలో, బంధువుల వద్ద గాలించారు. ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబీకులు టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, బాలుడు స్థానికంగా ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గులాబీ రంగు చొక్కా, బూడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

నోట్‌బుక్స్ పంపిణీకి సిద్ధం

- నిర్మల్ జిల్లాలో మొత్తం నోట్‌బుక్‌లు 2,76,789
- 6 నుంచి ఇంటర్ విద్యార్థులకు ప్రయోజనం

నిర్మల్ జిల్లా వివరాలు..

(ప్రభుత్వ, పంచాయతీరాజ్, గురుకులాలు, మోడల్, కేజీబీవీలు, అర్బన్ స్కూళ్లు)

మండలం	స్కూల్స్/కాలేజీలు	నోట్ బుక్స్
బాసర	20	6,573
భైంసా	60	28,781
దస్తురాబాద్	15	7,351
దిలావార్‌పూర్	23	9,233
కడెం	43	13,120
ఖానాపూర్	49	17,026
కుభీర్	67	14,594
కుంటాల	28	15,663
లక్ష్మణచాంద	32	17,059
లోకేశ్వరం	37	12,394
మామడ	40	18,444
ముధోల్	40	15,544
నర్సాపూర్(జి)	22	9,986
నిర్మల్‌అర్బన్	42	30,690
నిర్మల్‌రూరల్	27	8,091
పెంబి	19	4,925
సారంగపూర్	56	18,308
సోన్	23	12,623
తానూర్	44	16,384
మొత్తం	687	2,76,789


బడిబాటలో ఉపాధ్యాయులతోపాటు పాల్గొన్న డీఈవో(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర ప్రభుత్వం మనఊరు-మనబడి ద్వారా సర్కారు బడుల బలోపేతానికి కృషి చేస్తోంది. ఇప్పటికే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, పౌష్టికాహార మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు కల్పిస్తుండగా ఈ విద్యాసంవత్సరం ఉచిత నోట్‌బుక్స్ పంపిణీకి రంగం సిద్ధం చేసింది. ఈమేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బడులు ప్రారంభమైన తొలివారంలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు వర్క్‌బుక్స్, 6 నుంచి ఇంటర్ వరకు తరగతుల వారీగా బుక్‌లు పంపిణీ చేయనుంది. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్, కేజీబీవీ, గురుకులాలు తదితర ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటిలో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు వర్క్‌బుక్స్, 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్‌లను అందించనున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20 విద్యా దినోత్సవం నాటికి పంపిణీ చేయనున్నారు.

ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు

రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ, సమగ్ర శిక్ష సమన్వయంతో ఇప్పటికే ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. మన ఊరు-మనబడి ద్వారా బడుల రూపురేఖలు మారిపోయాయి. గతేడాది పదో తరగతి విద్యార్థుల కోసం సాయంత్రం స్టడీ అవర్స్ కోసం ఉచిత స్నాక్స్, రాగిజావా పంపిణీని చేపట్టింది. ఈ విద్యాసంవత్సరం జూన్ 20 నుంచి పూర్తిస్థాయిలో రాగిజావా అందజేయాలని సంకల్పించింది.

బడిబాటలో విద్యార్థుల నమోదు

ఈనెల 3 నుంచి ప్రారంభమైన 'బడిబాట'లో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటింటివెళ్లి ప్రభుత్వ బడుల్లో చేరాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. గడపగడపకూ తిరిగి ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తున్నారు. వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరుగుతోంది.

తరగతుల వారీగా...

ఆరు, ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి 6 నోట్‌బుక్‌లు ఉచితంగా ఇవ్వనుండగా.. 8వ తరగతి వారికి ఏడు, 9, 10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి 14 నోట్ బుక్‌లు పంపిణీ చేయనున్నారు. ఇంటర్ విద్యార్థులకు ఒక్కొక్కరికి 12 నోట్ బుక్‌లు, జిల్లా వ్యాప్తంగా 2,76,789 బుక్‌లు అందిచనున్నారు. జిల్లాకేంద్రం నుంచి ఆయా మండలాల ఎంఈవోలకు ఈ నోట్ బుక్స్ పంపిణీ కానుండగా.. మండలాల నుంచి ఆయా పాఠశాలలకు అవి చేరనున్నాయి. హెచ్‌ఎంలు వాటిని విద్యార్థులకు అందిస్తారని అధికారులు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు బుక్స్ అందిస్తాం

ఈ విద్యాసంవత్సరం నోట్ బుక్స్ పంపిణీకి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని మండలాల వారీగా నోట్‌బుక్స్ పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. అవి వచ్చిన వెంటనే విద్యార్థులకు అందజేస్తాం.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

ఇంద్రాదేవికి విత్తన పూజలు




ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రాదేవి ఆలయంలో ఆదివారం విత్తనపూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీ రైతులు తరలివచ్చారు. నవ ధాన్యాలతో కూడిన నైవేద్యం తయారు చేసి ఇంద్రాదేవికి సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.

– ఇంద్రవెల్లి(ఖానాపూర్)

యాదాద్రీశున్ని దర్శించుకున్న ఎంపీ 'సోయం'


ఎంపీ, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

ఆదిలాబాద్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని ఎంపీ సోయం బాపూరావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు, వేద పండితులు ఎంపీకి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఎంపీతోపాటు ఆయన సతీమణి భారతి భాయి, కుమారుడు వెంకటేశ్ దంపతులు, కూతురు కృష్ణవేణి, కుమారుడు మహేశ్‌కు అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు వారికి లడ్డూ ప్రసాదం అందజేశారు. తిరుపతి కన్నా యాదాద్రి ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌కు ఎంపీ ధన్యవాదాలు తెలిపారు.

ఇంద్రవెల్లి, భీంపూర్‌లో భారీ వర్షం



ఇంద్రవెల్లి/తాంసి: ఇంద్రవెల్లి, భీంపూర్ మండలాల్లోని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఇంద్రవెల్లి మండలం కోలయ్‌పాండ్రి, గోండ్‌గూడ, అంజీ, మామిడిగూడ తదితర గ్రామాల్లో ఈదురుగాలులకు పలువురి ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. అధికారులు ఇళ్లను పరిశీలించి ఆర్థికసాయం అందించాలని బాధితులు కోరారు.

అమ్మవారి దర్శనానికి వచ్చి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


శేఖర్ మృతదేహం


రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యాన్

సారంగపూర్: అడెల్లి మహాపోచమ్మను దర్శించుకుని తిరిగి వెళ్తుండగా ఒకరు అనంతలోకాలకు వెళ్లిపోయాడు. ఆలయ సమీపంలోని రాయికానగర్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. జిల్లా కేంద్రానికి చెందిన అయ్యన్నగారి శేఖర్(40) అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్ద తన బంధువులు చేస్తున్న శుభకార్యానికి భార్య రాధికతో కలిసి హాజరయ్యాడు. విందు భోజనం అనంతరం తిరిగి పయనమయ్యారు. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లా కిసానగర్‌కు చెందిన ఆరీఫ్‌బేగ్ ఐచర్ వ్యాన్‌తో వేగంగా నడుపుతూ శేఖర్ బైక్‌ను ఢీకొట్టాడు. కిందపడిన శేఖర్ పైనుంచి వ్యాన్ ఎక్కడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య రాధికతోపాటు డిగ్రీ రెండో సంవత్సరం, ఇంటర్ సెకండియర్ చదువుతున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కయిన శేఖర్ మృతితో ఆ కుటుంబం వీధి పాలైంది.

మంచిపేరు తెచ్చుకున్న శేఖర్..

నిర్మల్ జిల్లా ప్రాంతీయ రవాణా కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసే శేఖర్ వృత్తిలో అంకితభావంతో పనిచేస్తారని మంచిపేరు ఉంది. ఇటీవల కార్యాలయ ప్రారంభోత్సవంలో భాగంగా జిల్లా ప్రాంతీయ రవాణాధికారి అజయ్‌రెడ్డి ఆయన సేవలను గుర్తించి ప్రశంసించారు. కాగా, శేఖర్ మృతి విషయం తెలుసుకున్న ఆర్టీవో విచారం వ్యక్తంచేశారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈమేరకు సారంగపూర్ ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎదురెదురుగా కార్లు ఢీ


కార్ల ముందు భాగం దెబ్బతిన్న దృశ్యం


క్షతగాత్రుడిని తరలిస్తున్న స్థానికులు

- నలుగురికి తీవ్ర, మరో నలుగురికి స్వల్పగాయాలు

భైంసాటౌన్: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది గాయాలపాలైన ఘటన బాసర మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు చెందిన సౌరభ్ తన భార్య జాన్వి, తల్లి సునీతతో బాసర అమ్మవారిని దర్శించుకుని ఆదివారం కారులో తిరుగు ప్రయాణమవుతుండగా, ఆదిలాబాద్‌కు చెందిన మల్లేశ్ తన భార్య రాధ, కొడుకులు సాయితేజ, అన్విత్, కారు డ్రైవర్ మల్లేశ్‌తో కలిసి కారులో బాసర అమ్మవారి దర్శనానికి వస్తున్నారు. ఈ క్రమంలో భైంసా-నిజామాబాద్ రహదారిపై బాసర వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎనిమిదికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా, అంబులెన్స్ సకాలంలో రాకపోవడంతో క్షతగాత్రులను పోలీసు వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించినట్లు ఏఎస్సై ఉజ్వల తెలిపారు.

'కటకం' మృతి విప్లవోద్యమానికి తీరని లోటు

- విప్లవ రచయితల సంఘం (విరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాణి


నివాళులర్పిస్తున్న విరసం నేతలు

బెల్లంపల్లి: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ మృతి విప్లవోద్యమానికి తీరని లోటని విప్లవ రచయితల సంఘం (విరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాణి అన్నారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్‌లో సుదర్శన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదర్శన్ గొప్ప విప్లవ మేధావి అని ప్రశంసించారు. విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎంతో మేథోమథనం చేశారని గుర్తు చేశారు. దండకారణ్యంలో పార్టీ నిర్మాణానికి పునాది వేసిన వారిలో సుదర్శన్ అగ్రగణ్యుడన్నారు. ప్రజాచైతన్యంతోనే విప్లవోద్యమం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ నాటి పరిస్థితుల్లో విప్లవోద్యమం అవసరం ప్రజలకు ఎంతగానో ఉండేదన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్, నారాయణరావు మాట్లాడుతూ మావోయిస్టు ఉద్యమం ప్రస్తుతం దేశంలోని 16 రాష్ట్రాల్లో కొనసాగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేయడానికి ఆదివాసీ ప్రాంతాల్లో డ్రోన్‌లతో దాడులు చేయిస్తోందన్నారు. అమరుల ఆశయ సాధన కోసం మావోయిస్టు పార్టీ పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, అమరులు, బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర నాయకురాలు పద్మకుమారి, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా..

కొత్తగా నిర్మించిన చేపల మార్కెట్‌లో ఆటలు ఆడుకుంటున్న పిల్లలు



భాగ్యనగర్‌లో పాత చేపల మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి



జిల్లాకేంద్రంలోని భాగ్యనగర్‌లో మూడు నెలల క్రితం ప్రారంభించిన చేపల మార్కెట్ నిరుపయోగంగా మారింది. దీంతో పిల్లలు ఆటలు ఆడుకుంటున్నారు. చేపల విక్రయాలకు మత్స్యకారుల కోసం రూ.65 లక్షలతో రెండు షెడ్లు నిర్మించారు. ఇక్కడ కాకుండా భాగ్యనగర్ రోడ్డుపై పాత చేపల మార్కెట్‌లో అమ్మకాలు చేస్తుండడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

చేపల వేటకు వెళ్లి కానరాని లోకాలకు..


ఆత్రం లక్కు (ఫైల్)

బజార్‌హత్నూర్: చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. మండలంలో భూతాయి(బి) పంచాయతీ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సయ్యద్ ముజాహిద్ కథనం ప్రకారం.. భూతాయి(బి) పంచాయతీ పరిధిలోని కొలంగూడకు చెందిన ఆత్రం జంగు, లచ్చుబాయిల దంపతులకు మూడో కుమారుడు ఆత్రం లక్కు (26) ఉన్నాడు. ఆదివారం మధ్యాహ్న సమయంలో మిత్రులతో కలిసి లక్కు భూతాయి(కే) సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు లక్కు కాలు జారి నీటిలో పడిపోయాడు. మిత్రులు అతన్ని ఒడ్డుకు చేర్చినా అప్పటికే మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కుభీర్: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పల్సి గ్రామానికి చెందిన మహాగాం రమేశ్ (31)కు ప్రైవేట్ అప్పులు ఉన్నాయి. అవి తీర్చే మార్గం లేక మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో శుక్రవారం చేపలు పట్టేందుకు వెళ్తున్నానని చెప్పి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. గమనించిన కుటుంబీకులు అతన్ని భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్నానానికి వెళ్లి విద్యార్థి..


అయాజ్(ఫైల్)

నిర్మల్:జిల్లాకేంద్రంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన అయాజ్ (17) ఆదివారం స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం..ఇటీవల పదో తరగతి పూర్తిచేసిన అయాజ్ వారి తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. మిత్రులతో కలిసి భీమన్నగుట్ట ప్రాంతంలో ఉన్న పెద్ద నీటికుంటలో స్నానానికి వెళ్లాడు. లోతు ప్రదేశానికి వెళ్లడంతో ప్రమాదవశాత్తు మునిగి ఊపిరాడక చనిపోయాడు. పోలీస్, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టానికి పంపించారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

భైంసాటౌన్: విధులు ముగించుకుని బైక్‌పై వెళ్తున్న ఆర్టీసీ కండక్టర్‌ను వెనుక వైపు నుంచి కారు ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి.. లింబా(బి)కి చెందిన దిగంబర్ భైంసా ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా, రాత్రి వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో కారు బోల్తాపడగా, అందులో ఉన్నవారికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఏరియాస్పత్రికి తరలించారు. ఈ విషయమై పట్టణ సీఐ ఎల్.శ్రీనును వివరణ కోరగా, ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఇచ్చోడ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1986-87 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 36 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఇచ్చోడలో రాయల్ ప్యాలెస్‌లో ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. వృత్తిరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డవారు ఇక్కడకు వచ్చారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాటి తీపిగుర్తులను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రామారావు, ప్రేమల, ఖాజామీయా, లక్ష్మారెడ్డి, నారాయణ్‌రెడ్డి, పోశెట్టి, జీయోద్దీన్‌లను సన్మానించారు.